



పాడేరులోని సినిమా హాల్ కూడలి వద్ద పోలీస్ బందోబస్తు

నేడే కౌంటింగ్

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

పాడేరులో పాడేరు, అరకులోయ నియోజకవర్గాల కౌంటింగ్

రంపచోడవరంలో ఆ ఒక్క నియోజకవర్గం ఓట్ల లెక్కింపు

ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలకు మూడంచెల భద్రత

తొలిసారిగా పాడేరులో ఓట్ల లెక్కింపు ప్రక్రియ

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలో పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత పర్యవేక్షణలో పూర్తి చేశారు. జిల్లాలో పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి అక్కడి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు వీడియో చిత్రీకరణతో పాటు సీసీ కెమెరాల నిఘా ఉంటుంది.



కౌంటింగ్ గదుల ప్రవేశ మార్గంలో సాయుధ జవాన్





కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు సిద్ధం చేసిన దృశ్యం (ఇన్‌సెట్లో) కౌంటింగ్ గదుల్లోకి అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది వెళ్లే మార్గం

జిల్లాలో మూడు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరకులోయ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే అరకు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి అరకులోయ, పాడేరు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా కౌంటింగ్ ఏర్పాట్లు చేశారు. రంపచోడవరం నియోజకవర్గానికి సంబంధించి అక్కడ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం ఐదు గంటలకు కౌంటింగ్ అధికారులు, సిబ్బంది విధులకు హాజరై వారికి కేటాయించిన టేబుళ్లకు చేరుకుంటారు. ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించి, తొలుతగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు మొదలు పెడతారు. అలాగే ఎనిమిదిన్నర గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సహాయకుడు, ఒక పర్యవేక్షకుడు, ఒక సూక్ష్మ పరిశీలకుడు ఉంటారు. ప్రతి రౌండ్ పూర్తయిన వెంటనే ఆయా ఫలితాలను అధికారులు ప్రకటిస్తారు.

జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లు, కౌంటింగ్ ప్రక్రియ వివరాలు

అసెంబ్లీ స్థానం	పోలింగ్ కేంద్రాలు	పోలైన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు	పోస్టల్ ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
అరకులోయ	304	1,74,588	14	22	3,614	3	4
పాడేరు	318	1,58,747	14	23	2,707	3	3
రంపచోడవరం	399	2,08,025	20	20	4,422	5	5

కౌంటింగ్ కేంద్రాలకు మూడంచెల భద్రత

కౌంటింగ్ సజావుగా జరిగేందుకు పోలీసులు మూడంచెల భద్రతా చర్యలను చేపడుతున్నారు. అందుకు అవసరమైన ఆదేశాలను ఎస్పీ తుహిన్‌సిన్హా పోలీసు అధికారులకు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల ప్రవేశ మార్గం మొదలుకుని కౌంటింగ్ జరిగే గదుల్లోకి వెళ్లే వరకు మూడు చోట్ల పోలీసులు తనిఖీలు, పరిశీలనను జరుపుతారు. ఎన్నికల కమిషన్ అనుమతితో ఉన్న గుర్తింపు కార్డులున్న అధికారులు, సిబ్బందిని మాత్రమే అనుమతిస్తారు. పాడేరు, చింతపల్లి ఏఎస్పీలు కె.ధీరజ్, కె.ప్రతాప్‌శివకిశోర్‌లు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

వేర్వేరుగా ప్రవేశ మార్గాలు

పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే కౌంటింగ్ నిర్వహిస్తున్నప్పటికీ రెండు నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది రాకపోకలకు మాత్రం వేర్వేరుగా ప్రవేశ మార్గాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అరకులోయ ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని స్థానిక ఎంపీడీవో కార్యాలయం కూడలి నుంచి వచ్చే మార్గంలో కౌంటింగ్ కేంద్రాలకు ప్రవేశం కల్పిస్తారు. అలాగే పాడేరు అసెంబ్లీ, అరకులోయ ఎంపీ స్థానానికి చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి డిగ్రీ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవడానికి అనుమతిస్తారు.

పాడేరులో తొలిసారిగా ఓట్ల లెక్కింపు

పాడేరులో మంగళవారం తొలిసారిగా సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుంది. గతంలో ఇక్కడ జరిగిన ఎన్నికలకు సంబంధించి అప్పటికి జిల్లా కేంద్రమైన విశాఖపట్నంలోని స్వర్ణ భారతీ స్టేడియంలో కౌంటింగ్ నిర్వహించేవారు. ప్రస్తుతం పాడేరు జిల్లా కేంద్రం కావడంతో ఈసారి సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్‌ను ఇక్కడే చేపట్టనున్నారు. దీంతో పాడేరులో హడావిడి నెలకొంది.

పోలీసు వలయంలో పాడేరు

ఎక్కడికక్కడ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు

పాడేరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా కేంద్రం పాడేరు సోమవారం నుంచి పోలీసు వలయంలో ఉంది. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరిగిన హింస నేపథ్యంలో కౌంటింగ్, ఆ తరువాత ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పటిష్ఠ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాలకు సీఆర్‌పీఎఫ్ బలగాలతో మూడంచెల భద్రత, పట్టణంలోని ప్రతి చోటా పోలీసుల గస్తీ ఏర్పాటు చేశారు. పాడేరులో పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఎంపీ, ఎమ్మెల్యేలకు పడిన ఓట్లను లెక్కిస్తారు. దీంతో బరిలో ఉన్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, తదితరులు పాడేరు వస్తారు. ఈ క్రమంలో కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గాలతోపాటు ప్రతి కూడలి వద్ద పోలీసు బందోబస్తు పెట్టారు. 144 సెక్షన్ అమలులో భాగంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు మోహరించారు. అలాగే హోటళ్లు మినహా ఇతర దుకాణాలను మంగళవారం ఒక్కరోజు స్వచ్ఛందంగా మూసేయాలని పోలీసులు సూచించారు. అధిక సంఖ్యలో జనం గుమిగూడకూడదని, అల్లర్లు, ఘర్షణలకు పాల్పడకూడదని హెచ్చరించారు. ఏ పార్టీకి చెందిన అభ్యర్థులు లేదా వారి మద్దతుదారులు సైతం విజయోత్సవాలు, ర్యాలీలు వంటి కార్యక్రమాలను చేపట్టకూడదని పోలీసులు సూచించారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత



పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌పై సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ విజయసునీత

పాడేరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత తెలిపారు. అక్కడి కౌంటింగ్ ఏర్పాట్లను సోమవారం సాయంత్రం ఆమె స్వయంగా పరిశీలించారు. జిల్లాలో అరకులోయ నియోజకవర్గానికి సంబంధించి 22 రౌండ్లు, పాడేరుకు 23, రంపచోడవరానికి 20 రౌండ్ల లెక్కింపు జరుగుతుందన్నారు. సుమారుగా మూడు వేల మంది సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొంటారన్నారు. ఎటువంటి సమస్యలు, అపోహలకు ఆస్కారం లేకుండా కౌంటింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని ... మిగతా 8వ పేజీలో

అభ్యర్థులందరికీ ప్రత్యేక భద్రత

కౌంటింగ్ పూర్తయి ఇంటికి చేరే వరకు భద్రత కొనసాగింపు

అభ్యర్థులకు ఈ తరహా భద్రతా ఏర్పాట్లు కల్పించడం ఇదే తొలిసారి?

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థికి ఈసారి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఘర్షణలు, అల్లర్ల నేపథ్యంలో ప్రతి అభ్యర్థికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలనే ఎన్నికల కమిషన్ సూచనలతో పోలీసు అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు అవసరం మేరకు స్వతంత్ర అభ్యర్థులకు భద్రత కల్పిస్తున్నారు. పోలింగ్ రోజు, ఆ తరువాత సైతం రాష్ట్రంలో పలు హింసాత్మక సంఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. కానీ కౌంటింగ్ అనంతరం విజయం సాధించిన అభ్యర్థులపై ఓటమి పాలైన వాళ్లు లేదా ఓటమి చెందిన అభ్యర్థులపై విజయం సాధించిన వాళ్లయినా దాడులకు పాల్పడే అవకాశం ఉందనే నిఘా వర్గాల సమాచారం మేరకు ప్రతి అభ్యర్థికి ప్రత్యేక భద్రత కల్పించారు. అలాగే కౌంటింగ్ పూర్తయి సదరు అభ్యర్థి తన ఇంటికి చేరే వరకు ఈ భద్రతను కొనసాగిస్తారు. ఆ తరువాత సైతం భద్రతా పరమైన ...మిగతా 8వ పేజీలో



అరకులోయ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాంగి రాజారావుకు కల్పించిన బందోబస్తు



కౌంటింగ్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న పరిశీలకుడు వివేకానందన్

అంకితభావంతో కౌంటింగ్ విధులు నిర్వహించాలి

కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి కౌంటింగ్ పరిశీలకులు కె.వివేకానందన్, గజేంద్రకుమార్ సింగ్ సూచన

పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల కౌంటింగ్ అధికారులతో వేర్వేరుగా సమావేశాలు

పాడేరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపు ప్రక్రియను అంకితభావంతో నిర్వహించాలని కౌంటింగ్ పరిశీలకులు కె.వివేకానందన్, గజేంద్రకుమార్‌సింగ్ సూచించారు. జిల్లాలో అరకులోయ, పాడేరు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి కౌంటింగ్ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో సోమవారం వారిద్దరూ వేర్వేరుగా సమావేశాలను నిర్వహించి కౌంటింగ్ సందర్భంగా అధికారులు, సిబ్బంది చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విధులు నిర్వహించాలన్నారు. ఈవీఎంలు తరలించే సిబ్బందికి ప్రత్యేకంగా డ్రెస్‌కోడ్ ఉంటుందని, వారికి సైతం నంబర్లు కేటాయిస్తారన్నారు. అలాగే కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టామని పరిశీలకుడు వివేకానందన్ పేర్కొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న పరిశీలకుడు గజేంద్రకుమార్ సింగ్

అరకులోయ, పాడేరు అసెంబ్లీ స్థానాల రిటర్నింగ్ అధికారులు భావన వశిష్ఠ, అభిషేక్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగేతర అధికారులు, సిబ్బందికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకే ...మిగతా 8వ పేజీలో

గెలుపెవరిదో?

- నేడే ఎన్నికల ఫలితాలు వెల్లడి
- మధ్యాహ్నం 12 గంటలకల్లా స్పష్టత
- విశాఖపట్నం, అనకాపల్లి ఎంపీ సీట్ల
- గెలుపుపై సంపూర్ణ విశ్వాసంతో కూటమి
- అరకులోయపైనా ఆశలు

వార్త 8వ పేజీలో..

మొరాయించిన ఆర్టీసీ బస్సు

సీలేరులో నిలిచిపోయిన డొంకరాయి- పాడేరు బస్సు

ప్రయాణికుల అవస్థలు

సీలేరు, జూన్ 3: ఆర్టీసీ బస్సు మళ్లీ మొరాయించింది. పాడేరు డిపోనకు చెందిన బస్సు సోమవారం తెల్లవారుజామున మూడున్నర గంటలకు డొంకరాయిలో బయలుదేరి పాడేరు వెళ్లాల్సి ఉంది. అయితే బస్సు క్లచ్ ఆయిల్ సరఫరా చేసే పైపునకు రంధ్రం పడడంతో క్లచ్‌లో సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో అతి కష్టమ్మీద సీలేరుకు తీసుకొచ్చి ఆ బస్సులోని ప్రయాణికులను సీలేరు- విశాఖపట్నం బస్సులో ఎక్కించారు. దీంతో పాడేరు వెళ్లే ప్రయాణికులు ,చింతపల్లిలో బస్సు మారాల్సి ఉంటుంది. పాడేరు బస్సుకు సాంకేతిక లోపాలు తలెత్తడంతో నేరుగా పాడేరు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీలేరులో నిలిచిపోయిన బస్సుకు స్థానిక మెకానిక్ సహాయంతో సాంకేతిక లోపాలను సరిచేసి మధ్యాహ్నం 12 గంటల తరువాత పాడేరు తరలించారు. పాడేరు, విశాఖపట్నం డిపో ఆర్టీసీ అధికా రులు సీలేరు వంటి దూర ప్రాంతాలకు డొక్కు బస్సులనే నడుపుతుండడంతో తరచూ బస్సులు మొరాయిస్తూ ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.



సీలేరులో సోమవారం మధ్యాహ్నం వరకు నిలిచిపోయిన డొంకరాయి- పాడేరు బస్సు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరి పరిస్థితి విషమం

పెదబయలు/డుంబ్రిగుడ, జూన్ 3: ఒడిశా- ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డుంబ్రిగుడ మండలం గేదెలబంద గ్రామానికి చెందిన తాంగుల సతీశ్‌కుమార్(28), తాంగుల సునీల్(26) అన్నదమ్ములు. పెదబయలులో జరుగుతున్న వారపు సంతకు వారిద్దరూ బైక్‌పై స్వగ్రామం నుంచి తూటంగి మీదగా బయలుదేరారు. ఒడిశా రాష్ట్ర సరిహద్దు పాత్‌లుంగ్ పంచాయతీ సూడుబు గ్రామ సమీపంలో వారి వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో సంఘటన స్థలంలోనే సతీశ్‌కుమార్ మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన సునీల్‌ను స్థానికులు పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రికి పంపించారు.





ప్రమాదంలో మృతి చెందిన తాంగుల సతీశ్‌కుమార్ మృతదేహం. (ఇన్‌సెట్లో) తీవ్రంగా గాయపడిన సునీల్

గ్యాస్ వ్యాన్ బోల్తా పడి ఇద్దరికి గాయాలు

కొయ్యూరుకు గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వస్తుండగా ప్రమాదం ▸ బ్రేకులు ఫెయిల్ కావడమే కారణం

వార్త 8వ పేజీలో..

క్రైం... crime news

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

- స్వల్ప గాయాలతో బయటపడిన నలుగురు కుటుంబ సభ్యులు
- విశాఖ వెళ్లి వస్తుండగా తామరం వద్ద ఘటన


బోల్తా పడిన కారు

మాకవరపాలెం, జూన్ 3: మండలంలోని తామరం గ్రామం వద్ద డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడింది. ఇందుకు సంబంధించిన వివరాలివి. నర్సీపట్నానికి చెందిన ఓ కుటుంబం ఆదివారం కారులో విశాఖపట్నం వెళ్లింది. అక్కడ పనుల అనంతరం తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి ఇక్కడి తామరం గ్రామం వద్దకు వచ్చేసరికి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఆ సమయంలో కారులో నలుగురు ఉన్నట్టు చెపుతున్నారు. అయితే బోల్తాపడిన సమయంలో కారుకు ఉన్న బెలూన్లు ఓపెన్ కావడంతో వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇదిలావుంటే, తామరం వద్ద గల డివైడర్ ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నా నియంత్రణ చర్యలను అధికారులు చేపట్టడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డివైడర్లకు రేడియేషన్ స్టిక్కర్లు అటించడంతో పాటు ప్రమాద హెచ్చరికకు సంబంధించిన బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గ్యాస్ లీకై ఇద్దరు మహిళలకు గాయాలు

నక్కపల్లి, జూన్ 3: మండలంలోని న్యాయంపూడి గ్రామంలో మాజీ సర్పంచ్ కె.రమణ ఇంటిలో సోమవారం గ్యాస్ సిలెండర్ లీకవ్వడంతో మంటలు వ్యాపించాయి. పెద్ద ఎత్తున పొగ వ్యాపించడంతో మణి, వీర్రాజమ్మ అనే మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదవశాత్తూ గ్యాస్ లీకైనట్టు బాధితులు చెప్పారు. గాయపడిన ఇద్దరిని నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు.

దారి దోపిడీ

- సుమారు రెండు తులాల పుస్తెలతాడు తెంచుకుపోయిన దుండగులు
- చీడికాడ నుంచి మంచాల వెళుతుండగా మార్గమధ్యంలో ఘటన


బాధిత మహిళను ఓదార్చుతున్న కుటుంబ సభ్యులు

చీడికాడ, జూన్ 3: రోడ్డుపై నడుచుకుంటూ మండలంలోని మంచాల గ్రామానికి వస్తున్న ఇద్దరు మహిళలపై గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి దౌర్జన్యం చేయడమే కాక, ఓ మహిళ మెడలో పుస్తెల తాడును తెంచుకుపోయారు. ఇందుకు సంబంధించి బాధిత మహిళలు రొంగలి జగ్గమ్మ, కె.దేవి తెలిపిన వివరాలివి. జగ్గమ్మ కె.కోటపాడు మండలం రొంగలినాయుడుపాలెం నుంచి మంచాల వెళ్లేందుకు సోమవారం చీడికాడ వరకూ ఆటోలో వచ్చింది. అక్కడి నుంచి మంచాల గ్రామానికి ఆటో సదుపాయం లేకపోవడంతో అప్పటికే చీడికాడలో మంచాల వెళ్లేందుకు కె.దేవి అనే మహిళ సిద్ధం ఉండడంతో ఇద్దరూ నడుచుకుంటూ వస్తున్నారు. చీడికాడకు కిలోమీటరు దూరంలో రోడ్డు పక్కన ఉన్న బోరు వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెనుక వైపుగా వచ్చి ఇద్దరు మహిళలను పక్కన ఉన్న మడిలోకి తోసేశారు. అనంతరం జగ్గమ్మ మెడలో ఉన్న సుమారు రెండున్న తులాల బంగారం పుస్తెల తాడును తెంచుకుని వెళ్లిపోయారు. దీంతో వారు గగ్గోలు పెట్టారు. బాధిత మహిళ తన కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వెతికినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై చీడికాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు జగ్గమ్మ తెలిపింది.

మైదా పిండి లారీ బోల్తా


మైదా పిండిని తీసుకుపోతున్న స్థానికులు

ఎలమంచిలి, జూన్ 3: స్థానిక పెదపల్లి జంక్షన్ సమీపంలో సోమవారం మైదా పిండి లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు తగలలేదు. ప్రమాదం జరిగిన తరువాత బోల్తా పడిన లారీని యథార్థ స్థితికి తీసుకువచ్చి వెళ్లిపోయారు. లారీ నుంచి మైదా పిండి బస్తాలు కింద పడిపోవడంతో వీటిని తీసుకునేందుకు స్థానికులు ఎగబడ్డారు.

73 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు


మద్యం సీసాలు చూపుతున్న పోలీసులు

రోలుగుంట, జూన్ 3: మండలంలోని బుచ్చెంపేటకు చెందిన గాలి నూకరాజు అనే వ్యక్తి వద్ద నుంచి సోమవారం 73 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. గ్రామంలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపడుతుండగా గుర్తించిన ఈ మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడ్ని అరెస్టు చేసినట్టు చెప్పారు.

28 మద్యం బాటిళ్లతో మరొకరు...

పాయకరావుపేట, జూన్ 3: పట్టణంలో సోమవారం మద్యం బాటిళ్ల తరలిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 28 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. పట్టణానికి చెందిన జి.అనిల్‌బాబు అనే వ్యక్తి గోనెసంచితో మద్యం సీసాలు తీసుకెళుతుండగా బృందావనం వద్ద పట్టుకున్నట్టు చెప్పారు. అతని వద్ద 28 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు.

41 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, జూన్ 3 : మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి వేర్వేరు చోట్ల నలుగురు వ్యక్తుల నుంచి 41 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు. గొల్లపేట గ్రామానికి చెందిన జోగ సూర్యానారాయణ నుంచి 24 మద్యం సీసాలు, లంకెలపాలెంకు చెందిన కె. చంటి నుంచి ఆరు మద్యం సీసాలు, పెదముషిడివాడ గ్రామానికి చెందిన పొలిమేర రాము నుంచి ఎనిమిది మద్యం సీసాలు, వెన్నెలపాలెం గ్రామానికి చెందిన కడవల శంకరరావు నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరంతా ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పట్టుకున్నట్టు తెలిపారు. నిందితులు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

అర్ధరాత్రి కుండపోత

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

- డివిజన్‌లో 78.96 సెంటీమీటర్ల వర్షపాతం
- నర్సీపట్నంలో అత్యధికంగా 12.4 సె.మీగా నమోదు


వర్షపు నీరు బలిఘట్టంలో రోడ్డుపై గుంతల్లో చేరడంతో బోల్తాపడిన ఆటో

నర్సీపట్నం, జూన్ 3: వాతావరణంలో మార్పుల కారణంగా నర్సీపట్నం డివిజన్‌లో ఆదివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. జనం గాఢ నిద్రలో ఉండగా ఆకాశం విరిగి పడిందా అన్నట్టు ఫెళఫెళమని శబ్దాలతో కుండ పోతగా వానపడింది. చాలాసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నర్సీపట్నంలోని బలిఘట్టం మెయిన్ రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపించింది. సోమవారం ఉదయం ఈ రోడ్డులోని గోతిలో చేరిన నీరు కారణంగా ఆటో బోల్తాపడింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు నర్సీపట్నం డివిజన్‌లో 78.96 సెంటీ మీటర్ల వర్షం పాతం నమోదు కాగా అత్యధికంగా నర్సీపట్నం మండలంలో 120.4 మిల్లీ మీటర్లు (12.4సెంటీ మీటర్లు) వర్షం పడింది. నాతవరంలో 88.2, గొలుగొండ 48, రోలుగుంట 54.8. రావికమతం 32.4, మాడుగుల 12.6, చీడికాడ 44, కోటవురట్ల 96.8, మాకవరపాలెం 89.6, నక్కపల్లి 80.2, పాయకరావుపేట 48.4, ఎస్.రాయవరం 74.2 మిల్లీ మీటర్ల వర్షం పాతం నమోదైంది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

మాడుగుల సంతలో పైనాపిల్‌కు భలే గిరాకీ

- ఒక్కో పండు రూ.25 చొప్పున విక్రయం
- ఆనందం వ్యక్తం చేసిన గిరిజన రైతులు
- పనస, మామిడి సైతం భారీగా రాక


మాడుగుల సంతలో విక్రయానికి తెచ్చిన పైనాపిల్ ఫలాలు

మాడుగుల, జూన్ 3: పైనాపిల్ సీజన్ ఆరంభమైంది. ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాల్లో పండించిన ఈ పంటను ఆయా గిరిజన రైతులు సోమవారం మాడుగులలో జరిగిన వారపు సంతకు తీసుకు వచ్చారు. దేవాపురం, సలుగు, పులుసుమామిడి, కక్కి, కందులపాలెం, ఈదులపాలెం, వంట్లమామిడి, చింతగరువు వంటి మారుమూల గ్రామాల నుంచి గిరిజనులు సదరు ఫలాలను వాహనాలు, కావిడళ్లతో మోసుకుని వచ్చారు. సంత ఆరంభం నుంచి చివరి వరకు ఒక్కో పండు రూ.25 చొప్పున విక్రయాలు జరిగాయి. దీంతో సీజన్ ప్రారంభంలో మంచి ధర దక్కడంతో ఆయా రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, పనస పళ్లు కూడా భారీగానే వచ్చాయి. ఒక్కో పండు సైజును బట్టి వంద నుంచి రెండు వందల యాభై రూపాయల వరకు అమ్మకాలు జరిగాయి. అదేవిధంగా గత రెండు రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో మామిడి కాయలు సైతం సంతకు చాలా మంది రైతులు మోసుకుని వచ్చారు. దీంతో సంతలో ఎటుచూసినా కోలాహలం నెలకొంది. వ్యాపారులు సైతం ఎగబడి కొనుగోలు చేశారు.

రాయిపాడులో జ్వరాల విజృంభణ

- గ్రామంలో 18 ఆదివాసీ కుటుంబాలు నివాసం
- వీరిలో 11 మందికి అనారోగ్యం
- గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుకు వినతి


జ్వరంతో మంచం పట్టిన శివ

రావికమతం, జూన్ 3: మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు రాయిపాడులో పలువురు ఆదివాసీలు జ్వరాల బారినపడి మంచం పట్టారు. పద్దెనిమిది కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో పదేళ్ల బాలుడు గెమ్మిలి శివతో పాటు గెమ్మిలి గౌరీకి మలేరియా జ్వరం సోకింది. అలాగే, ఇదే గ్రామంలో పాంగి లక్ష్మి, సీదర దశి, సీదర చుక్కన్న, సీదర విమలమ్మ, గెమ్మిలి రాధ, చిక్కుడు సుబ్బు, సీదరి సన్నిబాబు, సీదరి బాబూరావు, గిన్నెల రాజులమ్మలతో పాటు పెదగరువు గ్రామానికి చెందిన మర్రి దుర్గా, విష్ణులు జ్వరాలతో మంచం పట్టారు. వీరంతా వారం రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో ఏఎన్ఎం ఇచ్చిన మాత్రల వల్ల జ్వరం తగ్గడం లేదని వాపోతున్నారు. ఆర్ఎంపీలను ఆశ్రయిస్తుండడం వల్ల జేబులు గుల్లవుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందిగా కోరుతున్నారు. ఇదిలావుంటే, జ్వరపీడితులను సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు సోమవారం పరామర్శించారు.

అభ్యర్థులు, ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

- అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ


అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల లెక్కింపునకు వచ్చే అభ్యర్థులు, ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలకు అనుమతించాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ బందోబస్తు విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి నిర్వహించాల్సిన విధులపై సోమవారం రాత్రి లెక్కింపు కేంద్రం వద్ద ఆయన అవగాహన కల్పించారు. కలెక్టర్, ఆర్వో జారీ చేసిన గుర్తింపు కార్డులను తనిఖీ చేయడంతో పాటు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలు లేవని నిర్ధారించుకున్న తర్వాతే లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. మెటల్ డిటెక్టర్ ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. బ్రీత్ ఎనలైజర్ కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలాగ వ్యవహరించే వారిపై ఎటువంటి ఉదాసీనత చూపించకుండా అక్కడ నుంచి పికప్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న తప్పిదాలకు అవకాశం లేకుండా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత

- మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు


శానిటరీ సెక్రటరీలకు సూచనలిస్తున్న కమిషనర్ రవిబాబు

నర్సీపట్నం, జూన్ 3 : మునిసిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలని మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు అన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలతో సోమవారం ఏర్పాటైన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ప్లాసిక్ కవర్లు, వాటర్ ప్యాకెట్లు లేకుండా చేయాలన్నారు. వాటర్ ప్యాకెట్లు తయారు చేయకుండా నివారించాలని సూచించారు. పండ్లు, కూరగాయలు, మాసం దుకాణాల వద్ద ప్లాసిక్ వినియోగం లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముందుగా వారం రోజులు గడువు ఇచ్చి, ఆ తరువాత దాడులు ముమ్మరం చేసి అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. అలాగే శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

49 మద్యం బాటిళ్లతో ఐదుగురు అరెస్టు

బుచ్చెయ్యపేట, జూన్ 3 : మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించి 49 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఇదిలావుంటే, మంగళవారం ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఎక్కడా విజయోత్సవాలు జరపరాదన్నారు. నిబంధలను అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

జలాశయంలో గిరిజనుడు గల్లంతు

చింతపల్లి, జూన్ 3: మండలంలోని తాజంగి జలాశయంలో ఓ గిరిజనుడు గల్లంతయ్యాడు. తాజంగి పంచాయతీ పరిధిలోని సిరగంపుట్టువీధికి చెందిన బురిడి గురుమూర్తి సోమవారం బంధువుల అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అనంతరం స్నానం చేసేందుకు జలాశయానికి వెళ్లి మునిగిపోయాడు. సహచరులు సాయంత్రం వరకు గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. దీంతో జలాశయం పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు.

భయంతోనే పోలీసుల కిరాయి ర్యాలీలు

- రోడ్లు, సెల్ టవర్లు మన్యం సంపదను దోచుకోవడానికే..
- మావోయిస్టు అల్లూరి, అనకాపల్లి డివిజన్ కార్యదర్శి అరుణ

జి.మాడుగుల, జూన్ 3: భయంతోనే పోలీసులు కిరాయి ర్యాలీలు నిర్వహిస్తున్నారని మావోయిస్టు పార్టీ అల్లూరి, అనకాపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకరులకు ఓ లేఖను విడుదల చేశారు. జిల్లా ఎస్పీ తుహన్ సిన్హా నేతృత్వంలో గత నెల 30న మద్దిగురువు వారపుసంతలో మావోయిస్టులారా.. మా జిల్లాకు రావొద్దంటూ ఐదు పంచాయతీలకు చెందిన ఆదివాసీలు ర్యాలీలు చేసినట్టు ప్రకటనలు చేసుకున్నారని, వాస్తవానికి అవి ప్రజలు నిర్వహించిన ర్యాలీలు కాదని పేర్కొన్నారు. అది పోలీసులు కొద్ది మంది ప్రజా వ్యతిరేకులను, ప్రజల చేతిలో శిక్ష గురైన ఇన్‌ఫార్మర్ల కుటుంబాలను ముందు పెట్టి, వారికి బ్యానర్లు ఇచ్చి మాట్లాడిపించారని విమర్శించారు. కొద్ది రోజుల ముందు చింతూరులో కూడా ఇదే విధంగానే పాల్పడ్డారని గుర్తు చేశారు. ఇటీవలే పెదబయలు ఏరియా గిన్నెలకోటలో 13 మంది మిలిషియ సభ్యులు లొంగుబాట్లు అని, వీరంతా పోలీసులు చేపడుతున్నా అభివృద్ధిని ఆకర్షితులై లొంగిపోయినట్టుగా చెప్పుకున్నారని విమర్శించారు. ఆదివాసీలకు తామే ఉద్ధరిస్తున్నట్టు వాలీబాల్ కిట్లు, వంట పాత్రలు ఇస్తే అభివృద్ధి చేసినట్టా అని ప్రశ్నించారు. గత నాలుగు దశాబ్దాలు పైగా మావోయిస్టు పార్టీ నాయకత్వంలో జల్ జంగిల్ జమీన్లతో పాటు విముక్తి కోసం తెగించి పోరాడిన చరిత్ర మన్యం వాసులదని, అట్టి మన్యాన్ని మవోయిస్టులను మా జిల్లాను రావొద్దనడం అస్పష్టదంగా ఉందని ఆమె హితవు పలికారు.

కౌంటింగ్‌కు ఏజెంటుగా కాకుండా అభ్యర్థిగా భావించి వెళ్లండి

- అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్


ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

కొత్తూరు, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్‌కు వెళ్లే ఏజెంట్లు అభ్యర్థిగా భావించి వెళ్లాలని కూటమి బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఒక హోటల్‌లో జరిగిన అనకాపల్లి పార్లమెంట్ కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణలో ఆయన మాట్లాడుతూ.. మెజార్టీ వస్తుందని ఎక్కడా మనం తగ్గవద్దన్నారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి, సహనం, క్రమశిక్షణతో నడుచుకోవాలని తెలిపారు. తగాదాలు సృష్టించేందుకు ఎవరెన్ని కుట్రలు చేసినా చిట్ట చివరి వరకు మనమంతా సైనికుల్లా కౌంటింగ్ కేంద్రంలో ఉందామన్నారు. బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ, ఈవీఎం, వీవీ ప్యాట్‌ల లెక్కింపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చివరి నిమిషం వరకు ఏజెంటు బాధ్యతలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దాడి రత్నాకర్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఈర్లె శ్రీరామమూర్తి, పీవీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బడుగు, కార్మిక వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన నేత 'పర్సా'

- సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్. నరసింగరావు


సమావేశంలో మాట్లాడుతున్న నరసింగరావు

అనకాపల్లి టౌన్, జూన్ 3: సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, స్వాతంత్ర సమరయోధుడు పర్సా సత్యనారాయణ శత జయంతి సభ సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పర్సా సత్యనారాయణ చిత్రపటానికి సీఐటీయూ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావు మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ జీవితాంతం బడుగు, బలహీన వర్గాలకు, కార్మిక వర్గ ప్రయోజనాలకు కృషి చేసిన నేతగా చిరస్థాయిగా నిలిచారన్నారు. నేటి కార్మికవర్గం ఆయన నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. నేటి సమకాలిన రాజకీయాల్లో నిస్వార్థంగా పనిచేయడంతో పాటు ప్రభుత్వాలు పెట్టే అన్ని రకాల నిర్బంధాలను, ఆటుపోటులను తట్టుకుని నిలబడిన పర్సా జీవితం ఆదర్శనీయమన్నారు. వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ కార్మికవర్గం సమస్యల పోరాటానికి సత్యనారాయణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి.కోటేశ్వరరావు, మధ్యాహ్న భోజన పథక కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, వీఓఏ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్. రూపాదేవి, గనిశెట్టి సత్యనారాయణ, ఎల్. శాంతి, బీశెట్టి అప్పారావు, ఎం.నాగేశు తదితరులు పాల్గొని పర్సా చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఆర్మీ బాయ్స్ హాస్టల్‌కు వెంకటేశ్ ఎంపిక


వెంకటేశ్

నక్కపల్లి, జూన్ 3: స్థానిక బీఎస్ హాకీ క్లబ్ క్రీడాకారుడు వెంకటేశ్ బెంగళూరులోని ఆర్మీ బాయ్స్ హాస్టల్‌కు ఎంపికైనట్టు హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు బలిరెడ్డి సూరిబాబు సోమవారం చెప్పారు. ఫిబ్రవరి 5 నుంచి 8 వరకూ బెంగళూరులోని కేంద్రీయ విద్యాలయంలో జరిగిన హాకీ సెలక్షన్స్‌లో వెంకటేశ్ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు ఆయన చెప్పారు. ఈనెల 4న వెంకటేశ్ బెంగళూరు ఆర్మీ బాయ్స్ హాస్టల్‌లో చేరతాడని చెప్పారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న వెంకటేశ్, అక్కడ టెన్త్ చదువుతాడని, అన్ని వసతులు వారే చూసుకుంటారని చెప్పారు. వెంకటేశ్ ఎంపిక పట్ల హాకీ క్లబ్ నిర్వాహకులు చిన్న అప్పారావు, రాంబాబు, కొల్నాటి తాతాజీ, గాజుల రామచంద్రరావు, రజిత్, నానాజీ, రమణ, శ్రీను అభినందనలు తెలిపారు.

5న బెనారస్ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూన్ 3: చక్రధర్‌పూర్ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం (5న) విశాఖ నుంచి బెనారస్ వెళ్లే 18311 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు రెండు గంటల 45 నిమిషాలపాటు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీంతో విశాఖలో ఉదయం 4.20 గంటలకు బయలుదేరాల్సిన ఈ రైలు ఉదయం 7.05 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

గ్యాస్ వ్యాన్ బోల్తాపడి ఇద్దరికి గాయాలు


గ్యాస్ సిలిండర్లతో బోల్తాపడ్డ వ్యాన్

కొయ్యూరు, జూన్ 3: పెదవలస-బూదరాళ్ల ప్రధాన రహదారిలోని బొంతువలసలో సోమవారం వ్యాన్ బోల్తా కొట్టింది. దీంతో డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. చింతపల్లి నుంచి కొయ్యూరుకు సోమవారం గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో బయలుదేరింది. పెదవలస నుంచి బొంతువలస, బూదరాళ్ల మీదుగా కొయ్యూరు వస్తూ బొంతవలస ఘాట్ రోడ్డు వద్ద బ్రేకులు ఫెయిల్ కావడంతో బోల్తా కొట్టింది. దీంతో వ్యాన్‌లో సుమారు 500 పైబడి గ్యాస్ నింపిన సిలిండర్లు చెల్లాచెదురుగా పడిపోయాయి. అదృష్టవశాత్తూ వ్యాన్ డ్రైవర్ రాజుతో పాటు క్లీనర్ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నిర్లక్ష్యపు నీడలో బీఎస్ఎన్ఎల్ ఓఎఫ్‌సీ వైర్లు

- తరచూ తెగిపోతున్నా పట్టని అధికారులు
- మూగబోతున్న సమాచార వ్యవస్థ
- వినియోగదారుల అగచాట్లు

ముంచంగిపుట్టు, జూన్ 3: బీఎస్ఎన్ఎల్ ఓఎఫ్‌సీ వైర్లు నిర్లక్ష్యపు నీడన మగ్గుతున్నాయి. రహదారి పక్కనే ఎందుకూ కొరగాకుండా కొట్టుమిట్టాడుతున్నాయి. దీనికితోడు ఎప్పటికప్పుడు వైర్లు తెగిపోతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో సమాచార వ్యవస్థ మూగబోతోంది. ఫలితంగా వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఓఎఫ్‌సీ వైర్లను సుమారు మూడు అడుగుల లోతులో పాతిపెట్టాల్సి ఉంటుంది. కానీ బీఎస్ఎన్ఎల్ అధికారులు తమ సొమ్ము కాదుకదా! అన్న రీతిలో ఓఎఫ్‌సీ లైన్‌ను పట్టించుకోకుండా అస్తవ్యస్తంగా వేశారు. పలుచోట్ల కనీసం గోతు కూడా తవ్వకుండా రహదారి పక్క నుంచే వైర్‌ను తీసుకు వెళ్లారు. ఓఎఫ్‌సీ వైర్లతో పలుచోట్ల కనక్టర్ బాక్స్‌లను సైతం రహదారి పక్కనే నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో తరచూ ఓఎఫ్‌సీ వైర్లు తెగిపోతున్నాయి. దాని కారణంగా సమాచార వ్యవస్థ మూగబోతోంది.

కొన్ని సందర్భాల్లో రెండు, మూడు రోజుల పాటు సిగ్నల్స్ ఉండకపోవడంతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెల్‌వన్, 2జీ, 3జీ, 4జీ ఇంటర్ నెట్ సేవలకు అవరోధం ఏర్పడుతోంది. ఇలా తరచూ జరగడంతో నెలవారీ డేటా వేసుకున్న వినియోగదారులు ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సమాచార వ్యవస్థ అందుబాటులో లేక తరచూ పడరాని పాట్లు పడుతున్నామని వాపోతున్నారు. ఇన్ని ఇబ్బందులు పడలేక చాలా మంది బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌లకు మారిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఓఎఫ్‌సీ వైర్లు తరచూ తెగిపోకుండా తగిన చర్యలు చేపట్టాలని, నెట్‌వర్క్ సక్రమంగా పనిచేసేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.





రహదారి పక్కనే పడి ఉన్న బీఎస్ఎన్ఎల్ ఓఎఫ్‌సీ వైరు...

బయటకు కనిపించే విధంగా వదిలేసిన కనక్టర్ బాక్స్

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పనిచేయక పింఛన్‌దారుల అవస్థలు

సీలేరు, జూన్ 3: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరులో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ మొరాయిస్తోంది. నెట్ సక్రమంగా పని చేయకపోవడంతో పింఛన్‌దారులు అవస్థలు పడుతున్నారు. యూనియన్ బ్యాంకు వద్ద గంటలు తరబడి పడిగాపులు కాస్తున్నారు.

సీలేరు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ వారం రోజులుగా సరిగా పని చేయక బ్యాంకు, పోస్టల్, జెన్‌కో కార్యాలయాల్లో కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సోమవారం పింఛన్‌దారులు ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల మొత్తాన్ని బ్యాంకు నుంచి తీసుకునేందుకు ఉదయం తొమ్మిది గంటలకే క్యూ కట్టారు. అయితే బ్యాంకు సిబ్బంది పది గంటలకు వచ్చి తెరిచనప్పటికీ బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పని చేయకపోవడంతో డబ్బులు లబ్ధిదారులకు అందలేదు. తీరా 11 గంటల తరువాత నెట్‌వర్క్ వచ్చిందనుకుంటే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో లావాదేవీలు జరగలేదు. జెన్‌కో సిబ్బంది 11 కేవీ నిర్వహణలో భాగంగా మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నెట్‌వర్క్, విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పింఛన్‌దారులు తీవ్ర అవస్థలు పడ్డారు.



సీలేరు యూనియన్ బ్యాంకు వద్ద నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న పరిశీలకుడు వివేకానందన్

మీడియా సెంటర్ సందర్శించిన పరిశీలకుడు

పాడేరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు నిర్వహించే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను కౌంటింగ్ పరిశీలకుడు కె.వివేకానందన్‌ను సోమవారం సందర్శించారు. మీడియాకు అక్కడ ఏర్పాటు చేసిన టీవీ, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. కౌంటింగ్ సందర్భంగా మీడియాకు ఎప్పటికప్పుడు ఫలితాల వివరాలు వెల్లడించడం, తదితర అంశాలను ఆయనకు డీపీఆర్‌వో పి.గోవిందరాజులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజనల్ స్థాయి పీఆర్‌వో రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



అమ్మవారి ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయసునీత

పాడేరు రూరల్, జూన్ 3: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ రాష్ట్ర జాతర సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విజయసునీత సోమవారం ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇందుకోసం త్వరలోనే అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కాగా, ఉత్సవ కమిటీ సభ్యులతో కలెక్టర్ మాట్లాడి ఏర్పాట్లపై చర్చించారు. పండగ సమయం ఆసన్నమవుతున్న నేపథ్యంలో త్వరగా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, ప్రసాదరావునాయుడు, పోతురాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. ఈవీఎం కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు సంబంధించిన గదులను పరిశీలించి, కౌంటింగ్ సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ఆమె వెంట పాడేరు, అరకులోయ ఆర్వోలు భావన వశిష్ఠ, అభిషేక్, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, తదితరులు ఉన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ విజయసునీత

రాష్ట్రంలో కూటమి.. పాడేరులో టీడీపీదే విజయం

- పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, జూన్ 3: రాష్ట్రంలో కూటమి, పాడేరులో టీడీపీదే విజయమని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి ధీమా వ్యక్తం చేశారు. మండలంలో సోమవారం పర్యటించిన ఆమె కృష్ణాపురం వైకుంఠ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో స్వామిరామనందజీ చేతులు మీదుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, పాడేరులో టీడీపీ విజయం సాధించాని హోమం జరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలన నుంచి జూన్ 4వ తేదీన రాష్ట్ర ప్రజలు విముక్తులవుతారన్నారు. ప్రజలు ఆశించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. ఒక్క అవకాశమని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఏ వర్గం ప్రజలకు న్యాయం చేయలేదని, అన్ని వర్గాలను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగ విస్మరించారన్నారు. దీంతో తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమి వైపు నిలబడ్డారన్నారు. గిరిజన ప్రజలకు మేలు జరిగే రోజులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడపా వీరబాబు పాల్గొన్నారు.



హోమం జరిపిస్తున్న గిడ్డి ఈశ్వరి, టీడీపీ నాయకులు

చినుకు పడినా.. గాలి వీచినా అంధకారమే!

- చింతపల్లి, గూడెంకొత్తవీధి ప్రజల నరకం

చింతపల్లి, జూన్ 3: చినుకుపడినా.. గాలివీచినా.. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల ప్రజలు అంధకారంలో మగ్గాల్సిన దుస్థితి దాపురించింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆదివారం మధ్యాహ్నం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు రెండు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం కూడా పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో రెండు మండలాల ప్రజలు ప్రత్యక్ష నరకం చూశారు.

చింతపల్లి విద్యుత్ ఉప కేంద్రానికి కొరుప్రోలు నుంచి విద్యుత్ సరఫరా జరుగుతున్నది. ఈ ప్రాంతానికి ప్రత్యామ్నాయ 11/33 కేవీ విద్యుత్ లైన్‌లేదు. పాడేరు నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ 11/33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణం ఐదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో మైదాన ప్రాంతంలో సాంకేతిక సమస్య తలెత్తినా, నర్సీపట్నం నుంచి చింతపల్లి వరకు విద్యుత్ లైన్‌లో ఇబ్బందులు వచ్చినా చింతపల్లి, గూడెంకొత్త మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఈపీడీసీఎల్ అధికారులుగాని, ప్రజా ప్రతినిధులుగాని కనీస చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రెండు మండలాల ప్రజలకు కరెంట్ కష్టాలు తీరడం లేదు. ఇప్పటికైనా ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రెండు మండలాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముంచంగిపుట్టులో గాలివాన బీభత్సం

తెగిపడిన విద్యుత్ వైర్లు

ముంచంగిపుట్టు, జూన్ 3: మండలంలో ఆదివారం అర్థ రాత్రి భారీ ఈదురు గాలులతో వర్షం కురిసింది. లక్ష్మీపురం, మాకవరం, బరడ, పెదగూడ, వనుగుమ్మ, దోడిపుట్టు, సుజనకోట తదితర పంచాయతీల్లో ఈదురు గాలులకు పలు చోట్ల విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అలాగే విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రంతా విద్యుత్ లేక పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకొన్న విద్యుత్ సిబ్బంది వెంటనే స్పందించారు. సోమవారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. తెగి పడిన విద్యుత్ వైర్లను, నేలకొరిగిన స్తంభాలను సరి చేశారు. విద్యుత్ వైర్లపై పడిన చెట్ల కొమ్మలను తొలగించారు. విద్యుత్ సరఫరాను యథావిధిగా అందించారు.



వైర్లను సరిచేస్తున్న సిబ్బంది

ఖరీఫ్ సాగుకు విత్తనాల పంపిణీ: ఏడీఏ జాహ్నవి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ జాహ్నవి, పక్కన ఏవోలు

చింతపల్లి, జూన్ 3: ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) కంటా జాహ్నవి తెలిపారు. మండల కేంద్రంలో కొయ్యూరు, గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ సహాయకులతో సోమవారం ఖరీఫ్ సాగుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ గిరిజన రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలన్నారు. తొలకరి వర్షాలు కురియడంతో వేసవి దుక్కులు చేసుకోవాలన్నారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ, రాగి, సామ, కొర్ర సాగుకు పంట పొలాలను సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే ఆర్‌బీకేలకు పచ్చిరొట్ట ఎరువు, వేరుశనగ విత్తనాలు వచ్చాయన్నారు. రైతులు విత్తనాలను తీసుకుని నాట్లు వేసుకోవాలన్నారు. అలాగే వరి, రాగి విత్తనాలు పంపిణీకి రైతుల నుంచి ఇండెంట్లు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు, గూడెంకొత్తవీధి, చింతపల్లి ఏవోలు ఉమాదేవి, మధుసూదన రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు

చింతపల్లి, జూన్ 3: ఆదివాసీ రైతులు వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ సాంకేతిక నిపుణుడు డాక్టర్ అప్పలరాజు చెప్పారు. మండలంలోని మల్లవరం గ్రామంలో ఎత్తుమడులు (బెడ్స్)లో పసుపు నాట్లు వేసుకునే విధానంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు సాగులో గిరిజన రైతులు దేశవాళి రకం విత్తనాలను నేరుగా పంట పొలాల్లో నాటుకోవడం వల్ల నాణ్యమైన దిగుబడులు పొందలేకపోతున్నారన్నారు. బెడ్స్‌ను సిద్ధం చేసుకుని పసుపు విత్తనం నాటుకుంటే దిగుబడులు పెరుగుతాయన్నారు. అధిక వర్షాల వల్ల మొక్కలకు నష్టం కలగదన్నారు. దుంపకుళ్లు తెగులును సైతం తట్టుకుంటుందన్నారు. అలాగే వరి, కాఫీ, మిరియాల పంటల సాగులోనూ ఆధునిక సేద్య పద్ధతులను పాటించాలన్నారు. కాఫీ మొక్కల్లో ఎండు కొమ్మలను తొలగించుకుని మొక్కలకు అవసరమైన సేంద్రియ ఎరువును పెట్టుకోవాలని సూచించారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో రైతులు రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

సంక్షిప్తంగా..

పాడేరు వెళ్లాలంటే పాస్ తప్పనిసరి

చింతపల్లి, జూన్ 3: ఎన్నికల పాస్ ఉన్నవారికే పాడేరు వెళ్లడానికి అనుమతి ఉంటుందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రమేశ్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మంగళవారం జిల్లా కేంద్రంలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుండడంతో 144 సీఆర్‌పీసీ అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు పాడేరుకు కౌంటింగ్ ఏజెంట్లు, విలేకరులు మాత్రమే వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాడేరు వెళ్లరాదన్నారు. వ్యక్తిగత అత్యవసర పనులు కలిగిన ప్రజలకు మాత్రమే మినహాయింపు ఉంటుందన్నారు. పాడేరులో ఏజెంట్ పాస్, విలేకరుల గుర్తింపు కార్డు లేని వ్యక్తులు పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలకు కూడా అనుమతి లేదని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులు, ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

జి.మాడుగుల: ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పాడేరు వెళ్లడానికి అనుమతులు లేని వ్యక్తులకు నిషేధించడం జరిగిందని సీఐ రమేశ్ చెప్పారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ప్రదేశంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ముందస్తు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల పాస్ కలిగిన వ్యక్తులకు మాత్రమే పాడేరు వెళ్లడానికి అనుమతి ఉంటుందని ప్రజలు గమనించాలని కోరారు.

ప్రజా ప్రతినిధులకు నోటీసులు

ముంచంగిపుట్టు, జూన్ 3: జిల్లా కేంద్రానికి మంగళవారం ప్రజా ప్రతినిధులు వెళ్లరాదని పోలీసులు నోటీసులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జిల్లా కేంద్రంలో జరగనున్నదని, దీంతో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఇందులో భాగంగా అన్ని పార్టీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, అనుచరులు జిల్లా కేంద్రానికి వెళ్లరాదని నోటీసులు జారీ చేసినట్టు ఆయన చెప్పారు.

నేడు వారపు సంత రద్దు

జి.మాడుగుల, జూన్ 3: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే వారపు సంత రద్దు చేస్తునట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఎటువంటి హింసాత్మక ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, అందువల్ల సంత రద్దు చేశామని చెప్పారు. ఈ విషయాన్ని గమనించాలని ప్రజలు, వర్తకులు, రైతులు తమకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

అంతర్లలో పిడుగుపాటు

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

చింతపల్లి, జూన్ 3: అంతర్ల గ్రామంలోని ఓ ఇంటి గోడపై పిడుగు పడింది. దీంతో గోడ పాక్షికంగా దెబ్బతిన్నది. ఆదివారం రాత్రి పిడుగులతో భారీ వర్షం కురిసింది. దీంతో అంతర్లలోని కొరాబు మోహన్‌రావు గృహం గోడపై భారీ శబ్దంతో పిగుడు పడింది. ఈ సమయంలో కుటుంబ సభ్యులు గృహంలోనే నిద్రపోతున్నారు. పిడుగు గృహం మధ్యలో పడివుంటే కుటుంబ సభ్యులకు పెను ప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పిడుగుపాటు వల్ల మోహన్ రావు గృహం గోడ, విద్యుత్ మీటరు ధ్వంసమైంది.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి: ఆపస్ నేత బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ

పాడేరు రూరల్, జూన్ 3: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ సూచించారు. జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం నిర్వహించిన అభ్యాసవర్గ కార్యక్రమంలో ఆయన ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మమేకం కావాలని, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఆపస్ ముందుంటుందన్నారు. విద్యార్థుల విజయం, విద్యా ప్రమాణాలు మెరుగు కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కిల్లో అప్పలరాజు, కోశాధికారి నవీన్, రాష్ట్ర సహాయ కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

అభ్యర్థులందరికీ ప్రత్యేక భద్రత

... 5వ పేజీ తరువాయి

సమస్యలున్నాయని గుర్తిస్తే ప్రత్యేక భద్రతను కొనసాగిస్తారు. వాస్తవానికి మావోయిస్టులు లేదా ఫ్యాక్షనిస్టుల హిట్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థులకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడం సహజం. కానీ అందుకు భిన్నంగా పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థికి ప్రత్యేక పోలీసు బందోబస్తు కల్పించడం గమనార్హం. ఎన్నో ఎన్నికలు జరిగినా గతానికి భిన్నంగా ఈమారు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థికి ప్రత్యేక పోలీసు భద్రత ఏర్పాటు చేయడం బహుశా ఇదే తొలిసారి కావచ్చునని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

అంకితభావంతో కౌంటింగ్ విధులు నిర్వహించాలి

... 5వ పేజీ తరువాయి

కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. మూడో విడత ర్యాండమైజేషన్ చేపట్టి కౌంటింగ్ సిబ్బందికి టేబుళ్లను కేటాయిస్తారన్నారు. 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభమవుతుందని, ఎనిమిదిన్నర గంటలకు ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభమవు తుందన్నారు. అధికారులు, సిబ్బందికి కేటాయించిన విధులపై అభిషేక్ స్పష్టంగా వివరించారు. ఈ సమావేశంలో చింతూరు ఐటీడీఏ పీవో కె.చైతన్య, పాడేరు ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌వో బి.పద్మావతి, ఎస్‌డీసీ వీవీఎస్‌శర్మ, రెండు నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గెలుపెవరిదో?

- నేడే ఎన్నికల ఫలితాలు వెల్లడి
- మధ్యాహ్నం 12 గంటలకల్లా స్పష్టత

(విశాఖపట్నం/అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఓటరు దేవుళ్ల తీర్పు వెలువడే రోజు వచ్చింది. ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. కౌంటింగ్ ఉదయం 8 గంటలకే ప్రారంభమైనా మధ్యాహ్నం 12 గంటల తరువాతే ఏ పార్టీకి విజయం దక్కుతుందనే విషయంలో స్పష్టత వస్తుంది. పోటీ చేసిన అభ్యర్థుల్లో ఏమవుతుందో అనే ఆందోళన చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నడూ లేనంతగా భారీగా ఖర్చు చేశామని, ఓటర్లు ఎవరి పక్షాన నిలిచారో అర్థం కావడం లేదని అంటున్నారు. కొందరిలో మాత్రం స్పష్టమైన ధీమా గోచరిస్తోంది. విజయం ఖాయం అని విశ్వాసంగా చెప్పగలుగుతున్నారు. మరికొందరు అభ్యర్థులలో గెలుపుపై విశ్వాసం లేదు. భారీ తేడాతో ఓడిపోకుండా, గట్టి పోటీ ఇచ్చామని అంతా భావిస్తే చాలు అని సర్ది చెప్పుకొంటున్నారు. కూటమి అభ్యర్థులైతే విజయం తమదే అనే ధీమాతో విజయోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు పార్లమెంటు స్థానాలకు గట్టి పోటీయే జరిగింది. విశాఖ పార్లమెంటుకు కూటమి తరఫున టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ పోటీ చేయగా, వైసీపీ నుంచి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, కాంగ్రెస్ నుంచి సత్యారెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా కేఏ పాల్ పోటీ చేశారు. పార్లమెంటు నియోజకవర్గంలో అత్యధికులు శ్రీభరత్ విజయం ఖాయమని ఘంటాపథంగా చెబుతున్నారు. కనీసం లక్ష ఓట్ల మెజారిటీ వస్తుందని ప్రచారం జరుగుతోంది. వైసీపీ వర్గాల్లో ఎంపీ స్థానంపై ఎటువంటి ఆశలు కనిపించడం లేదు. ఇక్కడ నుంచి కేఏ పాల్ కూడా పోటీ చేశారు.

అనకాపల్లి పార్లమెంటు ఎన్నిక రసవత్తరంగా సాగింది. అక్కడ కూటమి తరఫున మాజీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పోటీ చేయగా, వైసీపీ నుంచి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పోటీ చేశారు. ఇరువర్గాల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. సర్వేలన్నీ సీఎం రమేశ్ గెలుస్తారని, మంత్రి బూడికి పరాజయం తప్పదని వెల్లడించాయి. ఓటర్లు ఎవరిని కోరుకున్నారో మంగళవారం సాయంత్రం తేలిపోతుంది.

దేశంలో అతిపెద్ద పార్లమెంటు నియోజకవర్గాల్లో రెండోదైన అరకు నుంచి కూటమి అభ్యర్థిగా మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే కోడలు చెట్టి తనూజ, కాంగ్రెస్/వామపక్షాల అభ్యర్థిగా పి.అప్పలనర్స పోటీ చేశారు. ఇది ఐదు జిల్లాలలో కూడిన పార్లమెంటు నియోజకవర్గం కావడంతో ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో చెప్పలేని పరిస్థితి. వైసీపీ తమకే అవకాశం ఉందని భావిస్తోంది. ఇప్పటికే ఒకసారి ఎంపీగా గెలిచి ఉండడం, అనేక అభివృద్ధి పనులు చేసిన పేరు ఉండడంతో రెండోసారి ఎంపీగా గెలుస్తానని కొత్తపల్లి గీత ధీమా వ్యక్తంచేస్తున్నారు.

అనకాపల్లి జిల్లా అసెంబ్లీ స్థానాల్లో..

అనకాపల్లిలో జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ, వైసీపీ నుంచి ఎం.భరత్‌కుమార్ పోటీ చేయగా, పోరు హోరాహోరీగా సాగింది. అయితే ఎగ్జిట్ పోల్స్ కొణతాల రామకృష్ణకే అనుకూలమని వెల్లడించాయి. చోడవరం టీడీపీ అభ్యర్థిగా కేఎస్ఎన్ఎస్ రాజు, వైసీపీ నుంచి కరణం ధర్మశ్రీ మధ్య పోరు రసవత్తరంగా సాగింది. గెలుపుపై ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. మాడుగుల టీడీపీ అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తి, వైసీపీ నుంచి ఈర్లె అనురాధ పోటీ పడగా, విజయం ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఎలమంచిలి జనసేన అభ్యర్థిగా ఎస్. విజయ్‌కుమార్, వైసీపీ నుంచి కన్నబాబురాజు పోటీ పడగా, ఇక్కడ కూడా ఫలితాలపై అందరిలో ఆసక్తి నెలకొంది. పాయకరావుపేట టీడీపీ అభ్యర్థిగా వంగలపూడి అనిత, వైసీపీ నుంచి కంబాల జోగులు పోటీ చేయగా, ఎగ్జిట్ పోల్స్‌లో టీడీపీకే అనుకూలమని తేలింది. నర్సీపట్నం టీడీపీ అభ్యర్థిగా చింతకాయల అయ్యన్నపాత్రుడు, వైసీపీ నుంచి పెట్ల ఉమాశంకర్ గణేశ్ పోటీ పడగా, ఇక్కడ ఫలితాలపై కూడా ఉత్కంఠ నెలకొంది.

అల్లూరి జిల్లాలో..

పాడేరు టీడీపీ అభ్యర్థిగా గిడ్డి ఈశ్వరి, వైసీపీ నుంచి విశ్వేశ్వరరాజు పోటీ చేయగా, ఇక్కడ కూడా పోరు హోరాహోరీగా సాగింది. అరకు బీజేపీ అభ్యర్థిగా పాంగి రాజారావు, వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం మధ్య రసవత్తర పోరు సాగింది. వీరిలో ఎవరికి వారే తమదే గెలుపని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ జిల్లాలో..

విశాఖ జిల్లాలో గాజువాక, భీమిలి, తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజక వర్గాల్లో బలమైన అభ్యర్థుల మధ్య పోటీ జరిగింది. గాజువాక నుంచి టీడీపీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు పోటీ చేయగా, వైసీపీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పోటీగా నిలిపింది. ఈ ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావు అత్యధిక మెజారిటీ సాధిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భీమిలి నియోజకవర్గంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు మిత్రులు పోటీ పడ్డారు. ఇద్దరూ మాజీ మంత్రులే. తెలుగుదేశం నుంచి గంటా శ్రీనివాసరావు, వైసీపీ నుంచి ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు పోటీ చేశారు. నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కడతారనేది వేచి చూడాలి. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కూటమి తరఫున జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పోటీ చేశారు. వంశీకృష్ణ శ్రీనివాస్ మంచి మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తంచేస్తున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్ రాజు, వైసీపీ తరఫున కేకే రాజు పోటీ చేశారు. ఈసారి టీడీపీ, జనసేనలు కూడా అండగా నిలవడంతో విజయం ఖాయమని విష్ణుకుమార్‌రాజు విశ్వాసంతో ఉన్నారు. మరోవైపు తన గెలుపు ఖాయమని కేకే రాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. విశాఖ పశ్చిమంలో టీడీపీ అభ్యర్థిగా పెతకంశెట్టి గణబాబు, వైసీపీ నుంచి ఆడారి ఆనందకుమార్ పోటీ చేశారు. ఇరు వర్గాలు గెలుపు తమదేనని ధీమా వ్యక్తంచేస్తున్నాయి. పెందుర్తిలో జనసేన అభ్యర్థిగా పంచకర్ల రమేశ్‌బాబు, వైసీపీ నుంచి అదీప్‌రాజ్ పోటీ చేశారు. గట్టి పోటీ ఉండడంతో ఇరువర్గాలు విజయం తమదంటే తమదేనని ధీమాగా ఉన్నారు.